సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం। 10। జనవరి। 2024



వావ్..యూపీహెచ్‌సీలు..!

పట్టణ ప్రాథమిక కేంద్రా(యూపీహెచ్‌సీ)లు కొత్త రూపు సంతరించుకున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా దర్శనమిస్తున్నాయి.

- 8లో



స్కైమార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ

జైపూర్‌లో నిర్వహించిన 24వ జాతీయ స్కై మార్షల్ ఆర్ట్స్‌లో కొత్తవలస క్రీడాకారులు ప్రతిభ చూపారు.

- 8లో



ఆక్రమణల తొలగింపు

శృంగవరపుకోట పట్టణంలోని చెరుకు కాటా వద్ద గెడ్డ స్థలాన్ని కొందరు ఆక్రమించారు. వీటిని పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు తొలగించారు.

- 8లో

న్యూస్‌రీల్

2,457 మందికి వైద్యం

పార్వతీపురంటౌన్: జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్యశిబిరాల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. జగన్నాథరావు తెలిపారు. మంగళవారం నిర్వహించిన శిబిరాల్లో 2,457 మందికి వైద్యసేవలు అందించినట్టు వివరించారు. పార్వతీపురం పట్టణం చాకలి బెలగాం సుచివాలయం, పాలకొండ పట్టణంలోని యాలం సచివాలయం, సాలూరు తెలగవీధి సచివాలయ పరిధిలో బుధవారం జేఏఎస్–2 శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

మంగళవారం అందించిన వైద్యసేవలు	
మండలాలు	15
వైద్యశిబిరాలు	8
మొత్తం ఓపీలు	2,457
స్పెషలిస్టుల ఓపీలు	1197
పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఓపీలు	1266
డీఎం	250
హెచ్‌టీఎస్	329
ఏఎన్‌సీ	42
పీఎన్‌సీ	21
అనీమియా	21
ల్యాబ్‌టెస్టులు	1365
ఈసీజీ పరీక్షలు	41
కంటి పరీక్షలు	266
రిఫరల్ కేసులు	6

ప్రజలకు మేలు జరిగేలా పని చేయండి



మెప్మా సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ సుధాకర్

విజయనగరం: ప్రభుత్వం నిర్దేశించిన అంశాలను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు మేలు జరిగేలా చూడాలని మెప్మా సిబ్బందికి సంస్థ పథక సంచాలకుడు బి.సుధాకరరావు దిశానిర్దేశం చేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన మెప్మా సిబ్బందికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ బి.సుధాకర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తూ మెప్మా పనితీరును మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న మహిళా ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించాలన్నారు.

ఉత్తమ కేవీకేగా రస్తాకుంటుబాయి



ఉత్తమ కేవీకేగా అవార్డు అందిస్తున్న ఉపకులపతి శారద జయలక్ష్మిదేవి

కురుపాం: ఆచార్య ఎన్‌జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం గుంటూరులో 53వ పరిశోధన, విస్తృత సలహామండలి సమావేశం మంగళవారం జరిగింది. ఇందులో రస్తాకుంటుబాయి కృషివిజ్ఞాన కేంద్రానికి ఉత్తమ కేవీకే అవార్డును ఉప కులపతి డాక్టర్ శారద జయలక్ష్మిదేవి అందజేశారు.

ఇండియన్ స్టూడెంట్ పార్లమెంట్ సదస్సుకు ఎమ్మెల్సీ



పెనుమత్స సురేష్‌బాబు ఎమ్మెల్సీ

నెల్లిమర్ల రూరల్: భారతీయ ఛత్ర సన్సద్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు పూణేలో జరగనున్న ఇండియన్ స్టూడెంట్ పార్లమెంట్ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుకు ఆహ్వానం అందింది. పూణేలోని ఎంఐటీ, వరల్డ్ పీస్ యూనివర్సిటీలో జరగనున్న ప్రత్యేక సదస్సుకు హాజరుకానున్నట్టు ఎమ్మెల్సీ సురేష్ బాబు మంగళవారం తెలిపారు. సమాజానికి ఉపయోగపడే పలు అంశాలపై ప్రతిభ గల విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొంటానన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

విజయనగరం అర్బన్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో కేంద్ర ఎన్నికల సంఘం విజయవాడలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల తదితర సవరణలు పారదర్శకంగా చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ దీపిక పాల్గొన్నారు.

వసతిగృహాల్లో.. ఆరోగ్యకర భోజనం



పార్వతీపురం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు (ఫైల్)

- వసతి గృహాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు
- డైట్ చార్జీలు పెంచిన ప్రభుత్వం
- మెనూ ప్రకారం రుచికరమైన భోజనం
- జిల్లాలో 116 వసతిగృహాల్లో చదువుతున్న 24,384 మంది విద్యార్థులు

పార్వతీపురంటౌన్: విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం... సంక్షేమ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు నాడు–నేడు నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. మెనూ ప్రకారం రుచికరమైన, ఆరోగ్యకర భోజనం వడ్డిస్తోంది. విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచింది. వసతిగృహ విద్యార్థుల చదువులను ప్రోత్సహిస్తోంది. వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది.

డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు

వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు డైట్ చార్జీలతో పాటు కాస్మోటిక్ బిల్లులను పెంచి ప్రతినెలా ఠంచన్‌గా అందిస్తోంది. కాస్మోటిక్ చార్జీలు మూడు నుంచి ఆరో తరగతి బాలురకు రూ.110 నుంచి రూ.120కు, బాలికలకు రూ.110 నుంచి రూ.130, ఏడు నుంచి పదో తరగతి చదువుతున్న బాలురకు రూ.125 నుంచి రూ.150కు, బాలికలకు రూ.160 నుంచి రూ.200కు, ఇంటర్మీడియట్ ఆపైన విద్యార్థులకు రూ.125 నుంచి రూ.200, విద్యార్థినులకు రూ.160 నుంచి రూ.200కు పెంచింది. ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వీరఘట్టం సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహం

జిల్లాలో వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య ఇలా...

వసతి గృహాలు	సంఖ్య	విద్యార్థులు
ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్	15	725
బీసీ వెల్ఫేర్ హాస్టల్	19	950
ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్	77	19,775
రెసిడెన్షియల్ స్కూల్స్	5	2,934

పెరిగిన మెస్ చార్జీలు ఇలా..

తరగతి	హాస్టల్ గ్రేడ్	2018లో	2023లో పెరిగిన చార్జీలు
3, 4	ప్రీ మెట్రిక్	రూ. 1,000	రూ. 1,150
5–10	ప్రీ మెట్రిక్	రూ. 1,250	రూ.1,400
ఇంటర్, ఆపైన	పోస్టు మెట్రిక్	రూ. 1,400	రూ. 1,600

నాడు–నేడు నిధులతో సౌకర్యాల కల్పన

పార్వతీపురం మన్యం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర సంక్షేమ వసతి గృహాలతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలు 116 ఉన్నాయి. అందులో 24,384 మంది విద్యార్థులు చదువుతున్నారు. నాడు–నేడు పథకం కింద 29 వసతిగృహాలను అభివృద్ధి చేస్తోంది. 09 బీసీ వెల్ఫేర్, 06 సోషల్ వెల్ఫేర్, 14 ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల అభివృద్ధి పనులు కొన్ని పూర్తికాగా, మరికొన్ని జరుగుతున్నాయి.

మంచి భోజనం వడ్డిస్తున్నారు



ప్రభుత్వం వసతిగృహ విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు అనువైన సదుపాయాలు కల్పించింది. నాడు–నేడు నిధులతో అందంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దింది. డైట్ చార్జీలు పెంచి రుచికరమైన భోజనం వడ్డిస్తోంది. మాలాంటి పేద కుటుంబాల పిల్లల చదువుకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు.

– ఆరిక సాయికుమార్, సోషల్ వెల్ఫేర్ వసతిగృహం, పార్వతీపురం

పేద విద్యార్థులకు మేలు



పాఠశాలలు, వసతి గృహాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడంతో మాలాంటి పేద విద్యార్థులకు మేలు జరిగింది. హాస్టళ్లలో ఇప్పటికే సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. చక్కగా చదువుకుంటున్నాం.

– కె.మరియ, సోషల్ వెల్ఫేర్ వసతి గృహం, పార్వతీపురం

అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం



జిల్లాలోని అన్ని సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులందరికీ ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచింది. నాడు–నేడులో వసతి గృహాలు బాగుపడుతున్నాయి. విద్యార్థికి కొత్త మెనూతో పోషకాలతో కూడిన భోజనం అందుతోంది.

– మహ్మద్ గయాజుద్దీన్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి, పార్వతీపురం మన్యం

● గోదాదేవికి పొన్నాకుల హారతి



పవిత్ర ధనుర్మాసంలో పల్లెల్లో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతున్నాయి. భక్తులు ఆధ్యాత్మిక చింతనతో గడుపుతున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బలిజిపేట మండలంలోని వెంగాపురం, బలిజిపేట రామాలయాల్లో గోదాదేవికి పొన్నాకుల హారతులు మంగళవారం ఇచ్చారు. వెంగాపురంలో అర్చకులు కె.గోపాలకృష్ణ, బలిజిపేటలోని గొల్లవీధి రామాలయంలో శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. 24వ పాశురంలో భాగంగా పొన్నాకుల హారతి స్వామివారికి, గోదాదేవికి సమర్పించారు. భక్తులు తెల్లవారుజామున గోవిందనామాలతో తిరువీధి చేశారు. స్వామివారికి పుష్పాలతో అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు కె.సూర్యనారాయణ, మహిళాభక్తులు పాల్గొన్నారు.

– బలిజిపేట

పలువురు ఎస్‌ఐల బదిలీ

విజయనగరం క్రైమ్: జిల్లా శాఖలో పనిచేస్తున్న పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ ఎం. దీపిక మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. డీటీసీలో ఎస్‌ఐగా పనిచేస్తున్న ఐ.దుర్గాప్రసాద్‌ను సంతకవిటికి, అక్కడ పనిచేస్తున్న బి.లోకేశ్వరరావును బుదరాయవలసకు బదిలీ చేశారు. బుదరాయవలస ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్ నవీన్‌పడాల్‌ను సీసీఎస్‌కు, వన్‌టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న వి.అశోక్ కుమార్‌ను ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. వీరితో పాటు ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేస్తున్న వి.లోవరాజును సీసీఎస్‌కు, టూటౌన్ అటాచ్‌గా పనిచేస్తున్న బి.సాగర్‌బాబును సీసీఎస్‌కు, అక్కడ పనిచేస్తున్న కేవీవీ ప్రసాద్‌ను డీఎస్‌బీకి బదిలీ చేశారు. సీసీఎస్‌లో ఉన్న ఎం.వి.గోపాలస్వామిని డీటీసీకి, వి. శ్రీనివాసరావును డీసీఆర్‌బీకి, కె.తిరుమల రాజును పోలీస్ కంట్రోల్ రూమ్‌కు బదిలీచేశారు.

అలుపెరగని బాటసారి సీఎం జగన్



మక్కువలో కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర

- ప్రజాసంకల్పయాత్ర చేపట్టి ఐదేళ్లు పూర్తి
- కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర, పార్టీ శ్రేణులు

మక్కువ: అలుపెరగని బాటసారిగా, సంక్షేమ, అభివృద్ధి ప్రదాతగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ప్రజాసంకల్పయాత్ర మంగళవారంతో ఐదేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మక్కువలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మావుడి శ్రీనివాసరావు, మావుడి రంగునాయుడు ఆధ్వర్యంలో మంగళవారం సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం రాజన్నదొర కేక్ కట్ చేసి, మావుడి సోదరులకు తినిపించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయనకు నివాళులర్పించారు.

ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల కష్ట, నష్టాలను తెలుసుకునేందుకు ప్రతిపక్ష నేతగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సుమారు 3,648 కిలో మీటర్ల మేర పాదయాత్ర చేపట్టారన్నారు. 2019 జనవరి 9న ప్రజాసంకల్ప యాత్ర ముగిసిందన్నారు. పాదయాత్రలో గుర్తించిన సమస్యలన్నింటికీ పరిష్కారం చూపారన్నారు. ప్రజలకు అండగా ఉండేవారే నిజమైన నాయకుడని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు శక్తి వంచన లేకుండా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీనియర్ సహాయకులకు ఉద్యోగోన్నతి

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ ఆధీనంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సీనియర్ సహాయకులకు పరిపాలన అధికారులుగా ఉద్యోగోన్నతి కలిపిస్తూ జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం తన కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉద్యోగోన్నతి పొందిన సీనియర్ సహాయకుల్లో ఎస్. మోహన్‌కుమార్, సీహెచ్ వెంకటరావును పార్వతీపురం ఐటీడీఏకు, జి.సోమేశంను పార్వతీపురం డ్వామాలో ఏఓలుగా నియామకమయ్యారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సమన్వయంతో జాతర విజయవంతం చేద్దాం

- శంబర జాతరకు 150 ఆర్టీసీ బస్సులు
- శానిటేషన్ పనులకు 80 మంది మున్సిపల్ కార్మికులు
- జాతరలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన సేవలు
- ఆర్డీఓ హేమలత



జాతరపై అధికారులతో చర్చిస్తున్న ఆర్డీఓ హేమలత

మక్కువ: అధికారులు, గ్రామ ప్రజల సమన్వయంతో పోలమాంబ అమ్మవారి జాతరను విజయవంతం చేయాలని ఆర్డీఓ హేమలత కోరారు. శంబర గ్రామంలో మంగళవారం అన్ని శాఖల అధికారులు, గ్రామ పెద్దలతో జాతర ఏర్పాట్లపై ఆర్డీఓ హేమలత, ఏఎస్పీ సునీల్‌షొరాన్ సమీక్షించారు. శంబర పోలమాంబ అమ్మవారి జాతరను ప్రభుత్వం రాష్ట్ర గిరిజన జాతరగా గుర్తించిందని, అధికార యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, జాతర ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. జాతర నిర్వహణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న ట్రాన్స్‌కో అధికారులపై ఆర్డీఓ మండిపడ్డారు. జాతరలో శానిటేషన్ పనులు చేపట్టేందుకు సాలూరు, బొబ్బిలి, పార్వతీపురం మున్సిపాలిటీల నుంచి 80 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించామని తెలిపారు. వారికి కావలసిన వసతి, భోజన సౌకర్యాలు కల్పించాలని దేవదాయ శాఖ అధికారులకు ఆమె సూచించారు. మక్కువ నుంచి శంబర మార్గంలో ప్రమాదాలు జరగకుండా రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలగించాలని ఉపాధి హామీ ఏపీఓ ఈశ్వరమ్మను ఆదేశించారు. జాతరలో పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలని ఏఎస్పీ సునీల్‌షొరాన్, సాలూరు సీఐ ధనుంజయరావు, ఈఓపీఆర్ దేవకుమార్‌కు సూచించారు. అమ్మవారి దర్శనం వేగవంతంగా జరిగేలా క్యూకాంప్లెక్సులు ఏర్పాటుచేయాలన్నారు. జాతరలో రెవెన్యూశాఖ తరఫున ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ ఆవాల సూర్యనారాయణ తెలిపారు. జాతరలో సీసీ కెమెరాల ఏర్పాటు, భక్తులకు అందించే సేవల వివరాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.వి.సూర్యనారాయణ తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యంతో పాటు, పిల్లలకు ఉచితంగా పాలు సరఫరా చేస్తామన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం, క్యూలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. జాతరలో ప్రయాణికుల సౌకర్యార్థం 150 బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. సమీక్ష సమావేశంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

విధుల్లో చేరిన 218 మంది అంగన్‌వాడీ సిబ్బంది

- విధుల్లో చేరని వారికి షోకాజ్ నోటీసులు
- ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్.రాణి



ఎం.ఎన్.రాణి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో 218 మంది అంగన్‌వాడీలు విధుల్లో చేరినట్టు ఐసీడీఎస్ పీడీ ఎం.ఎన్. రాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాచిపెంట మండలంలో 168 మంది, సాలూరు మండలంలో 19 మంది, భామిని మండలంలో 28 మంది విధుల్లో చేరినట్టు పేర్కొన్నారు. 75 అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా పనిచేస్తున్నాయన్నారు. విధుల్లో చేరని 209 మంది అంగన్‌వాడీ సిబ్బందికి బుధవారం నుంచి పోస్టల్‌లో షోకాజ్ నోటీసులు పంపిస్తామన్నారు.

రైల్వేలో ఓపీఎస్ అమలుకు డిమాండ్



రైల్వేస్టేషన్ ఆవరణలో నిరసన తెలుపుతున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ అధికారులు, సిబ్బంది

విజయనగరం టౌన్: రైల్వేలో పాత పెన్షన్ విధానాన్నే అమలుపరచాలని ఆల్ ఇండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ చక్రవర్తి (భువనేశ్వర్) కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈస్టుకోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో విజయనగరం రైల్వేస్టేషన్ ఆవరణలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈస్ట్‌కోస్టు రైల్వేలో ఓల్డ్ పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) విధానాన్ని కొనసాగించాలని జోన్ మెత్తం నిరసన చేపట్టామన్నారు. 8, 9, 10 తేదీల్లో నిరసన తెలుపుతామని, 11న అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి విశాఖలో డీఆర్‌ఎమ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని చెప్పారు. న్యూ పెన్షన్ స్కీమ్‌ను రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్ విధానంలో రిటైరైన తర్వాత వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేస్తారని, ఇప్పటివరకూ దానిపై ఎటువంటి హామీలివ్వలేదన్నారు. అదే పాత పెన్షన్ విధానాన్ని అమలుచేస్తే రిటైరైన తర్వాత పింఛన్ ఉంటే అతనికి, తర్వాత భార్యకు, వారి కుటుంబీకులకు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ కె.వి.లక్ష్మణరావు, అప్పలరాజు, నాగేశ్వరరావు, జి.ఎస్. రామారావు, పి.శ్రీనివాసరావు, నారాయణరావు, రాంబాబు, ప్రసాద్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనాథకు 'ఆధార్'ం



పెన్షన్ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని గొల్లపల్లిలో పూర్వీకులు నివాసముండేవారు. చాలా ఏళ్ల క్రితం కుటుంబం విచ్ఛిన్నం కాగా ఊరొదిలి వెళ్లపోయి ఆరునెలల క్రితం మళ్లీ ఊర్లోకి వచ్చిన పేరు లావేటి బ్రహ్మజీరావు అనాథలా కొన్ని నెలలుగా రామమందిరం గడపలో పడుకుంటున్నాడు. సరిగా మాటలు కూడా రావు. అయితే స్థానిక వాలంటీర్ తామాడ ఆనందరావు బ్రహ్మజీరావును గుర్తించి స్థానికులతో మాట్లాడి ఆధార్ కార్డు చేయించి పెన్షన్‌కు అప్లై చేశాడు. వెంటనే అతనికి రైస్ కార్డు, పెన్షన్‌కూడా మంజూరైంది. ఈ క్రమంలో బ్రహ్మజీ రావుకు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు చేతుల మీదుగా మంగళవారం పెన్షన్ డబ్బు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనతోనే మానవత్వం, సంక్షేమం ప్రారంభమైందన్నారు. కొన్ని సంవత్సరాల నుంచి కనిపించకుండా కుటుంబం విచ్ఛిన్నమైన తరువాత గ్రామంలోకి వచ్చి రామమందిరంపై పడుకుంటున్న వ్యక్తికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన వలంటీర్ ఆనంద్, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి మున్సిపల్ చైర్మన్ ధన్యవాదాలు తెలిపారు.

1700 సారా ప్యాకెట్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారాతో ఎస్ఈబీ సిబ్బంది

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం అడ్డూరు వలస గ్రామ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో 1700 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక ఎస్ఈబీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం నుంచి సారా రవాణా అవుతోందన్న ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి అడారు గ్రామానికి చెందిన మండంగి శ్రీరాములు సారా ప్యాకెట్లు రవాణా చేస్తున్నట్లు గుర్తించి ఆయనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం పార్వతీపురం జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచామని చెప్పారు. దాడుల్లో ఎస్సై రమణ, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

29 మద్యం సీసాల స్వాధీనం

లక్కవరపుకోట: మండలంలోని లచ్చంపేట గ్రామం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 29 మద్యం సీసాలను ఏఎస్సై గోవిందరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామం సమీపంలో గల మద్యం దుకాణం నుంచి వేపాడ మండలంలోని కుంపల్లి గ్రామానికి చెందిన డెక్క నాయుడు మద్యం సీసాలను తరలిస్తుండగా పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై గోవిందరావు తెలిపారు.

2.5 లీటర్ల సారా..

కొత్తవలస: మండలంలోని తమ్మన్నమెరక గ్రామం సమీపంలో సారా అమ్ముతుండగా సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి దగ్గర 2.5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కొత్తవలస న్యాయస్థానంలో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹85	₹140	₹150

వావ్.. యూపీహెచ్‌సీలు..!



నూతనంగా నిర్మించిన విజయనగరంలోని 10వ వార్డులో యూపీహెచ్‌సీ

- సరికొత్త హంగులతో కార్పొరేట్ స్థాయిలో దర్శనం
- రూ.11 కోట్లతో నూతన భవనాల నిర్మాణం



విజయనగరంలోని రాజీవ్‌నగర్ కాలనీలో యూపీహెచ్‌సీలో రోగి సమస్య తెలుసుకుంటున్న వైద్యురాలు

విజయనగరం ఫోర్ట్: పట్టణ ప్రాథమిక కేంద్రా (యూపీహెచ్‌సీ)లు కొత్త రూపు సంతరించుకున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా దర్శనమిస్తున్నాయి. అన్ని రకాల వసతులతో యూపీహెచ్‌సీలను నిర్మించారు. అవన్నీ ఎంతో ఆహ్లాదకరంగా ఉన్నాయి. గత టీడీపీ ప్రభుత్వం పట్టణ ఆరోగ్య కేంద్రాలను గాలికి వదిలేసి వాటి నిర్వహణను ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూపీహెచ్‌సీలపై ప్రత్యేక దృష్టిసారించింది. అంతేకాకుండా వాటి నిర్వహణను కూడా ప్రభుత్వమే చేపట్టింది. యూపీహెచ్‌సీల సంఖ్యను కూడా పెంచింది. దీంతో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. 104 ద్వారా గ్రామీణుల చెంతకు వైద్యాన్ని అందిస్తున్న ప్రభుత్వం పట్టణ ప్రజలకు కూడా అదే తరహాలో అతి దగ్గరగా వైద్య సేవలు అందించే వీలుగా వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో గతంలో జిల్లాలో యూపిహెచ్‌సీలు 8 ఉండగా వాటిని ఇప్పుడు 18కి పెంచారు. విజయనగరం పట్టణంలో పూల్‌బాగ్, వీటీ అగ్రహారం, రాజీవ్‌నగర్, లంకాపట్నం, పార్వతీపురంలోని జగన్నాథపురం, బొబ్బిలి పట్టణంలోని సంగంవీధి, గొల్లవీధి, సాలురులోని మెంటాడ వీధిలో గతంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండేవి. .

కొత్తగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు

విజయనగరంలోని ఇస్మాయిల్ కాలనీ, ఉల్లివీధి, అరుంధతినగర్, జొన్నగుడ్డి, కేఎల్‌పురం, సాయి



రోగికి పరీక్ష కోసం శాంపిల్ తీస్తున్న టెక్నీషియన్

నాథకాలనీ, సంతపేట, వినాయకనగర్, నెల్లిమర్ల మొయిద జంక్షన్, బొబ్బిలిలోని సంగం వీధి, గొల్లపల్లి, బొబ్బిలిలోని సాయినగర్, రాజాంలోని బుచ్చిపేట, ఆదర్శనగర్‌లో కొత్తగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కార్పొరేట్ స్థాయిలో దర్శనం

జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో దర్శనమిస్తున్నాయి. అత్యాధునిక హంగులతో, పూర్తి స్థాయి వసతులతో వాటిని నిర్మించారు. జిల్లాలో కొత్తగా 10 యూపీహెచ్‌సీలకు సొంత భవనాలను నిర్మించారు. ఒక్కో భవనానికి రూ.1.10 కోట్లు చొప్పున మొత్తంగా రూ. 11 కోట్లు వెచ్చించారు.

యుపీహెచ్‌సీలో వసతులు

ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి గది, ఫార్మసీ గది, ల్యాబొరేటరీ, 10 పడకల వార్డు, మినీ ఆపరేషన్ థియేటర్, మినీ మీటింగ్ హాలు, మరుగుదొడ్లు నిర్మించారు. ఆస్పత్రి నిర్వహణకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేశారు.

సకాలంలో అందనున్న వైద్య సేవలు

పట్టణ పీహెచ్‌సీలను ప్రజలకు దగ్గరగా ఏర్పాటు చేయడం వల్ల సకాలంలో వైద్య సేవలు అందనున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగినా, అత్యవసర పరిస్థితిల్లో ఉన్న రోగులు 5, 10 నిమిషాల్లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకోవచ్చు. అక్కడ ప్రథమ చికిత్స తీసుకున్న తర్వాత రిఫరల్ ఆస్పత్రికి వెళ్లవచ్చు. దీని వల్ల ప్రాణాప్రాయ పరిస్థితిని తగ్గించవచ్చు. అంతేకాకుండా సీజనల్‌గా వచ్చే జ్వరం, దగ్గు, జలుబు వంటి వ్యాధులకు జిల్లా ఆస్పత్రికి, ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీ, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లనవసరం ఉండదు. అదేవిధంగా గర్భిణులు, పిల్లలకు వ్యాధినిరోధకటీకాలు కూడా ఇక్కడ వేయించవచ్చు. గర్భిణులకు వైద్య తనిఖీలు కూడ చేస్తున్నారు. హెచ్‌బీ, బీపీ, సుగర్, మలేరియా వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా చేస్తున్నారు.

జిల్లాలో పంజాబ్ మీడియా బృందం పర్యటన

విజయనగరం అర్బన్: భారత్ సంకల్ప యాత్రలో భాగంగా జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల పరిశీలన నిమిత్తం పంచాబ్‌కు చెందిన మీడియా ప్రతినిధుల బృందం మంగళవారం విజయనగరం జిల్లాలోని కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం అందిస్తున్న తరగతులు, ఏయే కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది? గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి ఈ విద్యాలయం ఎంత వరకు దోహదపడుతుంది. ప్రధానంగా విదేశీ సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారా? ఇతర సేనా కార్యక్రమాల నిర్వహణపై ఆరా తీశారు. ఇక్కడ తెలుసుకున్న అంశాలను తమ పత్రికల్లో కథనాలుగా ప్రచురించనున్నట్లు మీడియా



గిరిజన యూనివర్సిటీ అధికారులతో పంజాబ్ మీడియా బృందం

ప్రతినిధుల బృందం సభ్యులు దల్బీర్‌సింగ్, రొగిస్ సోధి వెల్లడించారు. వారికి కళాశాల నిర్వహణ తీరు, చేపడుతున్న కార్యక్రమాలను ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్, కళాశాల ఏఓ ఎన్ వీసూర్యనారాయణ, చిన్నారావు తదిరులు వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సంకల్పంతో 2019లో ఏర్పడిన ఈ విశ్వవిద్యాలయంలో ప్రధానంగా 14 కోర్సులను అందిస్తున్నట్లు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తెలియజేశారు. సుమారు 200 మంది ప్రస్తుతం ఇక్కడ చదువుతున్నారని తెలిపారు. నేషనల్ టాలెంట్ ఎగ్జామినేషన్ ద్వారా జాతీయ స్థాయిలో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నామని, దాదాపు ఏడాది కాలంలో సొంతభవనాలకు తరలిస్తామన్నారు. ఇక్కడ చదివిన విద్యార్థుల్లో సుమారు 14 మంది ఉపాధి అవకాశాలు పొందారని తెలిపారు. ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి తారకప్రసాద్, విజయవాడకు చెందిన పత్రికా సమాచార కార్యాలయ ప్రతినిధి హెన్రీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

స్క్యైమార్షల్ ఆర్ట్సులో ప్రతిభ

- మూడు గోల్డ్‌మెడల్స్, నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించిన కొత్తవలస క్రీడాకారులు

కొత్తవలస: రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు నిర్వహించిన 24వ జాతీయ స్క్యై మార్షల్ ఆర్ట్స్‌లో కొత్తవలస మండలానికి చెందిన పలువురు క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఈ మేరకు శిక్షకుడు ఎం.త్రినాథ్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 24వ జాతీయ స్క్యైమార్షల్ ఆర్ట్స్ పోటీల్లో దేశం మొత్తంగా 17 వందల మంది, కొత్తవలస మండలానికి చెందిన 11మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. వారిలో ఎం.నీలాంజినప్రసాద్(గోల్డ్‌మెడల్), ఎస్.లలితాకామేశ్వరి (గోల్డ్, సిల్వర్ మెడల్స్),ఎస్.కుసుమాశ్రీ (గోల్డ్,బ్రాంజ్ మెడల్స్),వై.వెంకటలక్ష్మి(సిల్వర్ మెడల్), పి.కరిష్మా(సిల్వర్ మెడల్),మాధవరావు, టి.దీపిక, సీహెచ్.అ



గోల్డ్‌మెడల్స్ సాధించిన క్రీడాకారులతో శిక్షకుడు త్రినాథ్‌రావు

నూష, జె.శ్రీజ, కె.తేజలు బ్రాంజ్ మెడల్స్ సాధించారని శిక్షకుడు తెలిపారు. ఈ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ ఏడాది నవంబర్‌లో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను పలువురు అభినందించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం



పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన రేణుకా కల్యాణి

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.రేణుకా కల్యాణి యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. విశాఖపట్నంలోని బుల్లయ్య కళాశాలలో ఈనెల 8న జరిగిన పోటీల్లో 84 కేజీల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆ విద్యార్థినిని కళాశాల అధ్యాపక సిబ్బంది కమలాకర్‌రావు, బి.రవి, పీడీ.బి.శ్రీనివాసరావు అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి



డ్రైవర్ వంశీ మృతదేహం

వీరఘట్టం: మండలంలోని విక్రమపురం గ్రామంలో గల వావిలపల్లి వెంకటనాయుడుకు చెందిన ఇటుక బట్టీలో మంగళవారం ఉదయం ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ ముచ్చి వంశీ(20) అక్కడికక్కడే మృతిచెందాడు. నాలుగేళ్లుగా తల్లిదండ్రులు సింహాచలం, గౌరీశ్వరిలతో కలిసి ఇదే బట్టీలో ఇటుకలు తయారీ చేస్తూ, ట్రాక్టర్ డ్రైవింగ్ నేర్చుకున్నాడు.ఇటుకల తయారీ కోసం కావాల్సిన మట్టిని వీల్ ట్రాక్టర్‌తో బాగా దుక్కిపట్టి తర్వాత ఆ మట్టితో ఇటుకలు తయారు చేస్తారు. ప్రతిరోజూ ఉదయాన్నే ఇలా వీల్ ట్రాక్టర్‌తో మట్టిని దుక్కిపడతారు. ఎప్పటిలాగానే మంగళవారం ఉదయం 7.30 గంటలకు మట్టిని దుక్కిపట్టేందుకు వీల్ ట్రాక్టర్‌ను వంశీ డ్రైవింగ్ చేశాడు. ఈ క్రమంలో సర్కిల్‌లో రౌండ్లు తిరుగుతుండగా ఒక్కసారిగా వీల్‌ట్రాక్టర్ బోల్తా పడగా ట్రాక్టర్ క్రింద డ్రైవర్ వంశీ ఉండిపోయి ఊపిరాడక క్షణాల్లో ప్రాణాలు విడిచాడు. వెంటనే జేసీబీ సాయంతో వీల్ ట్రాక్టర్‌ను పక్కకు నెట్టి వంశీని బయటకు తీశారు. అప్పటికే చనిపోవడంతో మృతదేహాన్ని స్వగ్రామం కడకెలకు తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై ఎం.గోవింద తెలిపారు.



మెరకముడిదాం: వాసు మృతదేహం

ట్రాక్టర్‌పై నుంచి పడి మరొకరు..

మెరకముడిదాం: మండలంలోని ఉత్తరావల్లి సమీపంలో ట్రాక్టర్‌తో వెళ్తున్న చొక్కాపు వాసు (33) వ్యక్తి ట్రాక్టర్‌పై నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలిలాఉన్నాయి. బాడంగి మండలం పాల్తేరు గ్రామానికి చెందిన చొక్కాపు వాసు ఉత్తరావల్లి గ్రామంలో బంధువుల వ్యవసాయపనుల నిమిత్తం సోమవారం ట్రాక్టర్‌ను తీసుకువచ్చాడు. ఆ పనులు ముగించుకుని మంగళవారం తిరిగి తన గ్రామానికి బయలుదేరి వెళ్తుండగా ఉత్తరావల్లి గ్రామం సమీపంలోనే ఏం జరిగిందో తెలయదు కానీ ట్రాక్టర్ రోడ్డుపక్కన పడి ఉంది. డ్రైవింగ్ చేస్తున్న వాసు ట్రాక్టర్ పడిపోయిన ప్రదేశానికి కొన్ని అడుగుల ముందు రక్తపు మడుగులో పడి ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న బంధువులు వెంటనే కుటుంబసభ్యులకు సమాచారమందించారు. మృతునికి భార్య అనసూయ ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు బుదరాయవలస ఎస్సై సీహెచ్ నవీన్‌పడాల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. అనంతరం కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చెరువులో పడి మహిళ..

భోగాపురం: మండల కేంద్రంలోని సంతోషిమాత ఆలయ సమీపంలో ఉన్న చెరువులో పడి ఓ మహిళ మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భోగాపురానికి చెందిన పాండ్రంగి కొండమ్మ(53) కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం వేకువజామునే లేచి కాలకృత్యాలకని చెప్పి సంతోషిమాత ఆలయ సమీపంలో ఉన్న చెరువు వద్దకు ఆమె వెళ్లింది. ప్రమాదవశాత్తు కాలుజారి చెరువులోపడి మృతిచెందింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతురాలి భర్త కొండలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై టీఎస్ఎన్ రాజు తెలిపారు.



భాస్కరరావు మృతదేహం

బైక్ ఢీకొని యువకుడు..

రామభద్రపురం: మండలకేంద్రంలో బైపాస్ రోడ్డు వద్ద స్కూటీని బుల్లెట్ ఢీకొనడం ఓ యువకుడు మంగళవారం మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని పెదపల్లి వీధికి చెందిన పెదపల్లి భాస్కరరావు(27) మంగళవారం ఉదయం పని నిమిత్తం బైపాస్ జంక్షన్‌కు స్కూటీపై వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఇంతలో విశాఖపట్నానికి చెందిన వ్యక్తులు ఒడిశా నుంచి మితిమీరిన వేగంతో బుల్లెట్‌పై విశాఖపట్నం వెళ్లిపోతూ లారీని క్రాస్ చేస్తుండగా స్కూటీని బలంగా ఢీకొట్టాడు. దాంతో స్కూటీపై ఉన్న భాస్కరరావు తుళ్లిపోయి డ్రైనేజీ కోన్‌కు తలతగిలి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్నేహితులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం చేశారు. మృతుడి భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు ఏఎస్సై చిన్నయ్య కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయం వెనుక ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్.సుధారాణి పర్యవేక్షించారు. బుధవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.

వైఎస్ఆర్‌సీపీలో పలువురి చేరిక



రాజాం: పార్టీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, పార్టీ నేతలు

రాజాం: పట్టణంలోని డోలపేట గ్రామానికి చెందిన పలువురు నాయీబ్రాహ్మణులతో పాటు ఇతర సామాజిక వర్గాలకు చెందిన మరికొన్ని కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఈ మేరకు మంగళవారం వారిని వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ పార్టీ కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన రాయవరపు అప్పారావు, గోవింద, కొమరిగిరి వెంకన్న, రాయవరపు శ్రీనులతో పాటు మరో పదిహేను కుటుంబాలు పార్టీలో చేరాయని తలే రాజేష్ వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమానికి ఆకర్షితులై వారంతా పార్టీలో చేరుతున్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాజాం నియోజకవర్గంలో ఓటింగ్ అంతా వైఎస్సార్‌సీపీకే ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు నల్లా శ్రీనివాసరావు, శాసపు వేణుగోపాలనాయుడు, గోకవలస బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలి

- జిల్లా జడ్జి బి.సాయికల్యాణ్ చక్రవర్తి
- ఏపీజీఈఏ క్యాలెండర్ ఆవిష్కరణ



ఏపీజీఈఏ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి

విజయనగరం అర్బన్: ప్రభుత్వ రంగ ఉద్యోగులు నిబద్ధతతో పనిచేసి ఆశాఖ లక్ష్యాలను సాధించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ్ చక్రవర్తి అన్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మంగళవారం ఆయన తన చాంబర్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా కార్యాలయాలకు వచ్చిన ప్రజలకు నిర్దేశిత కాలంలోనే ఉద్యోగులు సేవలను అందించాలని సూచించారు. విధుల సమయంలో చేసిన మంచిపనులు పదవీవిరమణ అనంతరం సమాజాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్వీయుగంధర్, జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరావు, కార్యదర్శి కంది వెంకటరమణ, జిల్లా కోశాధికారి వై.శంకరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.భూషణరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పీవీ కిరణ్‌కుమార్, సంఘం అర్బన్ కమిటీ అధ్యక్షుడు బి.బాలభాస్కరరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, కృష్ణ, సూర్యనారాయణ, వై.ధనుంజయ్‌కుమార్, రంభ జ్యోతి, సురేష్, పి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

పాచిపెంట: భార్య మందలించిందని పురుగు మందు తాగిన వ్యక్తి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన దాసరి అప్పన్న (52) రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో ఈనెల 7వ తేదీన భార్య మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగేశాడు. వెంటనే కుటుంబసభ్యులు విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు.

ఆర్‌బీకేలో చోరీ

దత్తిరాజేరు: మండలంలోని వి.కృష్ణాపురం ఆర్‌బీకేలో గుర్తు తెలియని వ్యక్తులు టీవీని చోరీ చేసినట్లు ఏవో అనూరాధ మంగళవారం తెలిపారు. ఆర్‌బీకే తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు విరగ్గొట్టి టీవీతో పాటు కంప్యూటర్ పరికరాలను ఎత్తుకెళ్లడంతో పెదమానాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.



చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఏవో అనూరాధ

ఆక్రమణల తొలగింపు

శృంగవరపుకోట: పట్టణంలోని చెరుకు కాటా వద్ద గెడ్డ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి కొద్ది రోజుల క్రితం పాకలు వేసిన విషయంలో పోలీసుల సహకారంతో మంగళవారం వాటిని రెవెన్యూ అధికారులు తొలగించారు. గెడ్డస్థలం ఆక్రమించి పాకలు నిర్మించడం చట్టరీత్యా విరుద్ధమని ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని వారు దరఖాస్తు ఇస్తే తగిన దర్యాప్తు చేసి స్థలాలు కేటాయిస్తామంటూ గతంలో తహసీల్దార్ బి.శ్రీనివాస రావు చెప్పినా ఆక్రమణదారులు పట్టించుకోలేదు. దీంతో రెవెన్యూ అధికారులు మంగళవారం చర్యలకు ఉపక్రమించి ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన పాకలను జేసీబీ సహాయంతో పూర్తిగా తొలగించారు. ఇదే సమయంలో తమకు పరిహారం ఇప్పించాలని ఆక్రమణదారులు ఆందోళన చేశారు. దీంతో తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా పాకలు ఏర్పాటు చేసి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టి బెదిరించే ప్రయత్నం చేయడం తగదని మీరు ఏర్పాటు చేసుకున్న పాకలకు ప్రభుత్వం ఎందుకు పరిహారం చెల్లిస్తుందని ప్రశ్నించారు. ఇకపై ప్రభుత్వ స్థలంలో తగిన అనుమతులు లేకుండా ఎవరైనా ఆక్రమణలకు పాల్పడితే చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



పాకలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు